క్లుప్తంగా

అన్నా క్యాంటీన్ పనుల పరిశీలన



గుల్లపాలెం ఆస్పత్రి వద్ద ఉన్న క్యాంటీన్ పనులను పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

మల్కాపురం: జీవీఎంసీ 59,60వ వార్డుల్లో రెండు చోట్ల చేపట్టిన అన్నా క్యాంటీన్ పనులను మంగళవారం జోన్-5 జెడ్సీ కృష్ణ పరిశీలించారు. తొలుత 60వ వార్డు గుల్లలపాలెం ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రి ముందు చేపడుతున్న అన్నా క్యాంటీన్ పనులను పరిశీలించారు. పనుల వివరాలను సిబ్బంది ద్వారా తెలుసుకుని.. నాణ్యత లోపం లేకుండా చేపట్టాలని సూచించారు.అనంతరం 59వ వార్డు పాతచెక్‌పోస్టు ఏరియాలో ఆర్టీసీ డిపో ఎదురుగా చేపట్టిన అన్నా క్యాంటీన్ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆగస్టులో ప్రారంభించనున్న నేపథ్యంలో పనులు వేగవంతం చేసినట్టు జెడ్సీ చెప్పారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ఆక్రమణలను ఉపేక్షించం

ములగాడ తహసీల్దార్ తారకేశ్వరి

మల్కాపురం: ములగాడ మండల పరిధిలోని ప్రభుత్వ భూముల్లో ఎవరైనా అనధికార నిర్మాణాలు చేపట్టినా.., విక్రయించాలని ప్రయత్నించినా అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తహసీల్దార్ తారకేశ్వరి హెచ్చరించారు. ఆమె మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కొండవాలు ప్రాంతాలతో పాటు ఎదురువానిపాలెం,ములగాడ తదితర ప్రాంతాల్లో విలువైన ప్రభుత్వ భూములను కాపాడడమే తమ లక్ష్యమని చెప్పారు. ఎక్కడైనా ఆక్రమణలు జరిగితే తమ దృష్టికి వస్తే తక్షణమే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అలాగే విద్యార్థులకు అవసరమైన ధ్రువ పత్రాల జారీలో జాప్యం చేస్తే సహించేది లేదన్నారు. దీనిపై సిబ్బందికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. మూడు రోజుల్లో మండల పరిధిలోని ప్రభుత్వ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

పచ్చదనం పెంపుతో కాలుష్య నియంత్రణ



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మల్కాపురం : జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మొక్కలు నాటారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ డే సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పలు ఔషధ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు పద్మజ మాట్లాడుతూ కాలుష్య నివారణకు మొక్కల ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి వద్ద మొక్కలు నాటి నగరాన్ని పచ్చదనంతో నింపాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

డాబాగార్డెన్స్: మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధి జగదాంబ జంక్షన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు స్థానిక పోలీసులకు సమాచారమిచ్చారు. దాంతో వారొచ్చి 108లో కేజీహెచ్‌కి ఆ వ్యక్తిని తరలించారు. ఆ వ్యక్తి అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఆచూకీ తెలిసిన వారు 0891-274866, 9440796010 నంబర్లకు తెలియజేయాలని పేర్కొన్నారు.

రోజూ అమావాస్యే!

ఎల్‌ఈడీ లైట్లు వెలగవు.. కొత్తవి ఏర్పాటు చేయరు.. ఉన్న వాటికి మరమ్మతులు చేయరు.. ఇలా వీధి దీపాల్లోనూ రాజకీయం చూపిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ బల్బుల నిర్వహణను గాలికి వదిలేసింది. దీంతో నేతాజీ వంతెన కూడలి రహదారిలో విద్యుత్ స్తంభాలకు ఎల్‌ఈడీ లైట్లు వెలగక అంధకారం రాజ్యమేలుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంతెనపై ఉన్న విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వాటిని తొలగించకుండా పాదచారులు నడిచే ఫుట్‌పాత్‌లపై అడ్డంగా వేసి వదిలేశారు. దీంతో రాత్రి వేళల్లో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలూ చోటు చేసుకుంటున్నాయి. అలాగే వివిధ ప్రాంతాల్లో కూడా వీధి దీపాలు వెలగడం లేదు. -కంచరపాలెం



దయానందనగర్‌లో వెలగని విద్యుత్ లైట్లు



కొండవాలు ప్రాంతాల్లో నిత్యం ఇదే పరిస్థితి



ఊర్వశికూడలి గౌరీనగర్‌లో విద్యుత్ స్తంభానికి లైట్లు లేని దృశ్యం

- అంధకారంలో వీధులు
- విద్యుత్ దీపాల నిర్వహణ అస్తవ్యస్తం
- పట్టించుకోని నాయకులు, అధికారులు

40వ వార్డు నుంచి 63వ వార్డులకు సంబంధించిన విద్యుత్ దీపాల వివరాలు

హైమాస్ట్ లైట్లు	92
రింగులైట్లు (120 వాట్స్)	132
ప్రధాన జంక్షన్‌ల్లో భారీ స్తంభాల లైట్లు	18
ఎల్‌ఈడీ వీధి లైట్లు (20వాట్స్)	3800
ఎల్‌ఈడీ వీధి లైట్లు (40వాట్స్)	4200
ఎల్‌ఈడీ వీధి లైట్లు (60వాట్స్)	2950
ఇతర లైట్లు	1820

కంచరపాలెం కూడలి నుంచి ఊర్వశి కూడలి మీదుగా ఐటీఐ జంక్షన్ వరకు వీధుల్లో తరచూ దీపాలు వెలగడంలేదు. దీంతో అ ప్రాంతమంతా అంధకారం అలముకుంటుంది. అసలే ఇరుకు సందుల్లో ద్విచక్ర వాహనాలు రాకపోకల వేగానికి అడ్డూ అదుపు ఉండడంలేదు. చీకట్లో రాత్రి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జీవీఎంసీ 47,48, వార్డుల కొండవాలు ప్రాంతాలు రాంజీ ఎస్టేట్, కప్పరాడ, ఇందిరానగర్, పెదకొత్తూరు. శ్రీనివాస్‌నగర్, బాపూజీనగర్, సంజీవయ్యకాలనీ, అరుంధతినగర్, జైభారత్‌నగర్, శివలింగపురం, జీవీఎంసీ 56, 57వ వార్డుల మురికివాడల ముత్యమాంబకాలనీ, పైడిమాంబకాలనీ, రాజీవ్‌నగర్, దయానందనగర్, చాకలిగెడ్డ గొల్లకంచరపాలెం, గవరకంచరపాలెం, రామ్మూర్తిపంతులుపేట, దుర్గానగర్, గౌరీనగర్, ప్రాంతాలల్లో రాత్రిపూట కొన్ని దీపాలు వెలగడం లేదు. వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా మారింది. తరచూ ఇదే పరిస్థితి నెలకొంటుందని, సమస్యపై ఫిర్యాదులు చేసినా జీవీఎంసీ విద్యుత్ శాఖ అధికారులు స్పందించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

చీకట్లో రాకపోకలు సాగిస్తున్నాం



రాత్రి సమయంలో మా వీధుల్లో విద్యుత్ దీపాలు సక్రమంగా వెలగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు దీపాలే లేవు. అటుగా రాకపోకలు సాగించాలంటేనే భయాందోళనగా ఉంది. ఆకతాయిల ఆగడాలు శృతిమించిపోతున్నాయి. పిల్లలను బయటకు పంపాలంటే ఇబ్బందిగా మారుతోంది. విద్యుత్ దీపాల నిర్వహణ అధ్వానంగా ఉంది. జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు.

-సీహెచ్ ఈశ్వరమ్మ, రాంజీ ఎస్టేట్, కంచరపాలెం.

అధికారులు స్పందించాలి



జోన్-5 పరిధిలో విద్యుత్ దీపాల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. ప్రధాన రహదారులు, వంతెన రహదారి, పలు వీధుల్లో విద్యుత్ దీపాలు సక్రమంగా పనిచేయడంలేదు. ఫిర్యాదు చేస్తే సిబ్బంది తూతూ మంత్రంగా మరమ్మతులు చేస్తున్నారు. కాలం చెల్లిన విద్యుత్ దీపాలు వేసి చేతులు దులుపుకుంటున్నారు. సంబంధిత అధికారులు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

-ఆర్ రాము, బర్మాక్యాంప్, ఊర్వశికూడలి,

విద్యుత్ స్తంభాలపై వైర్ల తొలగింపు



వైర్ల తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఈపీడీసీఎల్ డీఈ త్రినాథరావు, ఏఈ శ్రీనివాసరావు



స్తంభంపై అస్తవ్యస్తంగా ఉన్న వైర్లను సరి చేస్తున్న సిబ్బంది

కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు

సాక్షి ఎఫెక్ట్..

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం దరి ప్రకాష్‌నగర్‌లోని పలు వీధుల్లో విద్యుత్ స్తంభాలకు అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ వైర్లను అధికారులు సరిచేశారు. విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లు, లైన్లు, సర్వీసు వైర్లు అస్తవ్యస్తంగా ఉన్న సమస్యపై సాక్షి దినపత్రికలో మంగళవారం పిచ్చుక గూళ్లు కాదు..విద్యుత్ తీగలే అన్న శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. మల్కాపురం ఈపీడీసీఎల్ (మల్కాపురం సబ్‌స్టేషన్ డీఈ త్రినాథరావు, ఏఈ శ్రీనివాసరావు మంగళవారం సమస్యాత్మక ప్రాంతాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. విద్యుత్ స్తంభాలపై అస్తవ్యస్తంగా ఉన్న వైర్లను,కేబుల్ వైర్లను తొలగించారు. దీంతో ఆయా ప్రాంత వాసులు విద్యుత్ అధికారులతో పాటు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి

తహసీల్దార్ రమేష్



విశాఖ విద్య: మండల పరిధిలోని రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని గోపాలపట్నం తహసీల్దార్ చావలి వెంకట రమేష్ అన్నారు. ఆయన వివిధ పనులపై వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. గతంలో భీమిలి తహసీల్దార్‌గా, అంతకుముందు కలెక్టరేట్‌లో పనిచేసిన అనుభవంతో గోపాలపట్నం మండలంలో రెవెన్యూ పరమైన సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు తగిన శ్రద్ధ తీసుకుంటానన్నారు. కార్యాలయ అధికారులు, సిబ్బందితో సమీక్షించి మండలంలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, రెవెన్యూ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఓ అవగాహనకు వస్తానన్నారు. కార్యాలయంలో సిబ్బంది కొరత లేదని, క్షేత్రస్థాయిలో వీఆర్‌వోల సర్దుబాటు చేయాల్సి ఉందన్నారు. పూర్తి స్థాయిలో పరిశీలించిన మీదట సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తానని చెప్పారు. వీఆర్‌వోలు అన్ని చోట్ల అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకుంటానన్నారు. కార్యాలయంలో ప్రతీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తామన్నారు. ప్రజలకు అన్ని వేళలా తాను అందుబాటులో ఉంటానన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా తనతో చెప్పుకోవచ్చన్నారు. ఉన్నతాధికారుల సూచనలకు అనుగుణంగా అంతా సమన్వయంతో పనిచేసి ప్రజలకు సేవలు అందిస్తామన్నారు.

చట్టాలు సమర్థంగా అమలు చేయాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్ : చిన్నారులు, మహిళల అక్రమ రవాణా విషయంలో పోలీసులు అప్రమత్తంగా వుండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ సూచించారు. వారి రక్షణకు ఉద్దేశించిన చట్టాలు సమర్థంగా అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక న్యాయ సేవా సదన్‌లో మంగళవారం ఉదయం జువైనల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ, రక్షణ) చట్టంపై ప్రత్యేక జువైనల్ పోలీస్ యూనిట్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో చిన్నారుల అక్రమ రవాణా, మాయం కావడం వంటి కేసులు సమాజాన్ని కలవరపెడుతున్నాయన్నారు. అదేవిధంగా యాసిడ్ దాడులకు గురైన మహిళల రక్షణకు ప్రభుత్వం కల్పించిన చట్టాలు సమర్థంగా అమలు పరచాలని కోరారు. అందరూ చట్టాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఒకటో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ, రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి సి.కె.గాయత్రి దేవి, ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ ఎస్.వరలక్ష్మి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ పాల్గొన్నారు.

పక్కాగా ఉచిత ఇసుక పంపిణీ

డిపో సిబ్బందికి జేసీ మయూర్ అశోక్ ఆదేశం

మహారాణిపేట: జిల్లాలో అమలవుతున్న నూతన ఉచిత ఇసుక పంపిణీ విధానం పక్కాగా అమలు కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలో పలువురు అధికారులతో కలిసి ఆయన ఇసుక డిపోలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నూతన ఉచిత ఇసుక సరఫరా విధానాన్ని అమలు చేస్తోందన్నారు. జిల్లాలో సజావుగా, సులభతరంగా ఇసుక పంపిణీ విధానం అమలుకావాలని సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సరఫరాలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టి, స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక ధరలను పారదర్శకంగా అమలుచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్, గనుల శాఖ ఉప సంచాలకులు డీఈవీఎస్ ఎస్ఎన్. రాజు, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేవీ-1 విద్యార్థులకు వైద్యపరీక్షలు



విద్యార్థులతో రోటరీ క్లబ్ సభ్యులు

కంచరపాలెం: స్థానిక 104 ఏరియా కేంద్రీయ విద్యాలయం-1లో విద్యార్థులకు రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో ఆధ్వర్యంలో మంగళవారం ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా 3020 అసిస్టెంట్ గవర్నర్ కె.సునీత లావణ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థులకు ఏటా వైద్య పరీక్షలు చేయిస్తున్నట్లు తెలిపారు. సుమారు 1245 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైజాగ్ మెట్రో అధ్యక్షుడు డాక్టర్ గంగాధర్, కార్యదర్శి రొటేరియన్ రాజేష్, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మొదిలి మహేష్, పూర్వ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ జి.కిషోర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఒమ్మి కిరణ్, నాగిరెడ్డి హరిత, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారు సంఘాలకు ప్రోత్సాహం

మహారాణిపేట: రైతు ఉత్పత్తిదారు సంఘాల (ఎఫ్‌పీవో-ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్)కు తగిన విధంగా ప్రోత్సాహం అందించాలని, ప్రొడక్ట్స్‌కు సరైన మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర పథకాల తాలూకా ఫలాలను రైతులకు చేరువయ్యేలా అధికారులు కృషి చేయాలని నిర్దేశించారు. స్థానిక కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఎఫ్‌పీవో డిస్ట్రిక్ట్ లెవెల్ మానిటరింగ్ కమిటీ సమావేశం మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లాలోని వివిధ రైతు ఉత్పత్తిదారు సంఘాల ప్రతినిధులతో పలు అంశాలపై చర్చించారు. రైతులు పండించే పంటలు, వాటి మార్కెటింగ్ అవకాశాలు, స్టోరేజ్ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారు సంఘాలకు అన్ని విధాలుగా సహకారం అందించాలని, వారికి ఆర్థిక ప్రయోజనాలు కలిగే విధంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. అలాగే రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చేలా.. అధిక లాభాలు పొందే విధంగా రైతు ఉత్పత్తిదారు సంఘాలు కృషి చేయాలన్నారు. సమావేశంలో నాబార్డ్ డెవలప్‌మెంట్ మేనేజర్ బసంత్ కుమార్, ఎల్డీఎం శ్రీనివాసరావు, వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖల అధికారులు, డీఆర్డీఏ పీడీ శోభారాణి, ఉత్పత్తిదారు సంఘాలకు చెందిన ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

తిరుపతిలో వెలమలకు ఓ కాటేజీ

ఆల్ వెలమ సంక్షేమ సంఘం తీర్మానం



సమావేశమైన వెలమ సంఘం ప్రతినిధులు

డాబాగార్డెన్స్: వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం వెళ్లే తిరుమల వెళ్లే వెలమ కుల భక్తుల సౌకర్యార్థం వెలమ సంఘ నేతలు తిరుపతిలో వసతి నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే నిర్మించిన శ్రీశైలం, కాశీ పుణ్యక్షేత్రాల్లోని కాటేజీల తరహాలో తిరుపతిలో కూడా భవనాలు నిర్మించాలని ఆల్ వెలమ సంక్షేమ సంఘం ప్రతిపాదించింది. రాష్ట్రం నలుమూలల నుంచి పలువురు సంఘ ప్రతినిధులు విశాఖ కేంద్ర సంఘం కార్యాలయంలో సమావేశమై ఈ మేరకు తీర్మానించారు. తిరుపతి నుంచి వచ్చిన కర్రి సతీష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతి భవనాల నిర్మాణానికి అవసరమైన స్థల, నిధుల సేకరణకు రాష్ట్రంలోని వెలమ జాతీయులందర్నీ కలిసి సలహాలు, సూచనలు సేకరిస్తామన్నారు. వెలమ సెంట్రల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చుక్క చినబాబు మాట్లాడుతూ సామాజికంగా, రాజకీయంగా వెలమలంతా ఐకమత్యంతో ఒక్కటై పయణించాలని పిలుపునిచ్చారు. ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి బండారు రామకృష్ణ, ఆల్ వెలమ సమన్వయకర్త అల్లు శంకరరావు, గూనూరు వెంకట రమేష్, సిరికి పోతురాజు, సింగంపల్లి రామారావు, కింజరాపు సూర్యనారాయణ, మరడాన శేష గిరిరావు, రంభ బుజ్జి, జి.లక్ష్మణ, గునుపూరు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

తనికెళ్ల భరణికి 'రంగసాయి జీవన సాఫల్య పురస్కారం'



కార్యక్రమ వివరాలు వెల్లడిస్తున్న బాదంగీర్ సాయి

డాబాగార్డెన్స్: నాటకరంగ ప్రోత్సాహమే లక్ష్యంగా 2010 ఆగస్టు 1న ప్రారంభమైన రంగసాయి నాటక సంఘం 14 ఏళ్ల ప్రయాణంలో నాటక రంగానికి ఎనలేని సేవలందించిందని నిర్వాహకుడు బాదంగీర్ సాయి తెలిపారు. ఈ మేరకు మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో వార్షికోత్సవ కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఆగస్టు ఒకటిన కళాభారతి ఆడిటోరియం వేదికగా సాయంత్రం 6 గంటల నుంచి వార్షిక వేడుకలు నిర్వహించనున్నట్టు చెప్పారు. వెండి తెరకే ఆభరణంగా వెలుగొందుతున్న రంగస్థల నటుడు, రచయిత, దర్శకుడు తనికెళ్ల భరణికి 'రంగసాయి జీవన సాఫల్య పురస్కారం'అందజేయనున్నట్టు చెప్పారు. అలాగే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న రంగస్థల ప్రముఖుల్లో మరో ఐదుగుర్ని ఎంపిక చేసి రంగసాయి థియేటర్ అవార్డు ఈ ఏడాది నుంచి ఇవ్వనున్నట్లు తెలిపారు. తొలి పురస్కారాలు ప్రముఖ దర్శకుడు ఎస్ఎం భాషా, యువ నటుడు వి. సతీష్‌కుమార్, నాటక ప్రోత్సాహకుడు, పరిషత్ నిర్వాహకుడు బుద్దాల వెంకట రామారావు, పౌరాణిక రంగస్థల నటీమణి కె. మంగాదేవి, అతిపిన్న వయస్సు నుంచి పౌరాణిక పాత్రలు ధరిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొంది ప్రభుత్వ నంది పురస్కారం అందుకున్న బగాది రితీష్ చందుకు ఈ అవార్డు అందజేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎస్. నాగేశ్వరరావు, శివజ్యోతి, రవిబ్రహ్మ, నవరసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నావికులకు ఘన వీడ్కోలు



అధికారులతో పదవీ విరమణ పొందిన నావికులు

సింధియా : తూర్పు నావికాదళ పరిధి ఐఎన్ఎస్ డేగాలో నిస్వార్థంగా సేవ చేసి పదవీ విరమణ పొందిన 63 మంది నావికులు, వారి కుటుంబాలకు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలుకుతూ అభినందన సభ ఏర్పాటు చేశారు. కమాండింగ్ ఆఫీసర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన నావికుల సేవలను అధికారులు కొనియాడారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ సంఘం నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ మూడు గేట్ల వద్ద మంగళవారం ధర్నా చేశారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలన్నారు. ఎన్‌జేసీఎస్‌లో పెంచిన వేతనాలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్మికుల తొలగింపు ఆలోచన విరమించుకోవాలన్నారు. ఈ అంశాలపై ఆగస్టు 5,6,7 తేదీల్లో అన్ని విభాగాధిపతుల కార్యాలయాల వద్ద ధర్నాలు చేస్తామన్నారు.

తండ్రి చెంతకు కుమార్తె



చాంతినీకుమారిని తండ్రికి అప్పగిస్తున్న వాసు

డాబాగార్డెన్స్ : వారం రోజుల కిందట విశాఖ రైల్వే స్టేషన్ ప్రీపెయిడ్ ఆటో స్టాండ్ వద్ద వర్షంలో తడుస్తూ చాందినీ కుమారి, ఆమె కుమారుడు ఆయుష్‌కుమార్‌ను ట్రాఫిక్ కానిస్టేబుల్ చూసి ఏయూటీడీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించి టీఏస్పార్ మహిళా షెల్టర్‌కు తరలించి ఆశ్రయం కల్పించారు. వివరాలు అడిగితే భర్త వదిలేశాడని, పని కోసం వచ్చానని, ఊరు కుసుంద, ధన్‌బాద్ సిటీ, జార్ఖండ్ రాష్ట్రమని చెప్పింది. కుటుంబ సభ్యుల సమాచారం కోసం రాంచీలో ఉంటున్న లాఖీదాస్‌ను సహాయం అడిగితే, వెంటనే వాళ్ల టీంను పంపి బాధితురాలి తల్లిదండ్రులను కలిసి ఫోన్‌లో మాట్లాడించారని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. తండ్రి సుదామాదాస్ వెంటనే విశాఖకు వచ్చి తన అల్లుడు తన కూతుర్ని వదిలేసి వేరే పెళ్లి చేసుకోవడంతో అప్పటి నుంచి కూతురి మానసిక ఆరోగ్యం పాడైందని, రాంచీ ఆస్పత్రిలో జాయిన్ చేశామని తెలిపారన్నారు. కూతుర్ని జాగ్రత్తగా అప్పగించినందుకు ప్రగడ వాసుకు కృతజ్ఞతలు తెలిపారు.

టోల్‌గేటు టెండర్ రద్దుకు వినతి

అగనంపూడి: కార్పొరేషన్ పరిధిలో కొనసాగిస్తూ వచ్చిన అగనంపూడి టోల్ ప్లాజా నిర్వహణ కోసం పిలిచిన టెండర్‌ను వెంటనే రద్దు చేయాలని ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాత్ రంజన్‌ను దళిత సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర సమితి సమన్వయకర్త బూసి వెంకటరావు కోరారు. నగరంలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వాస్తవంగా టెండర్ కాల పరిమితి ముగిసి, మూడేళ్లు పూర్తి అయిందని తెలిపారు. కాంట్రాక్టర్ లాభాలు రాలేదని ఒకసారి, అనకాపల్లి, పెందుర్తి జాతీయ రహదారి విస్తరణ పూర్తి అయ్యాక అక్కడి టోల్‌ప్లాజా తరలిస్తామని మరోసారి కోర్టును, అధికారులను తప్పుదోవ పట్టించి సదరు కాంట్రాక్టర్ అక్రమంగా దారి దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు.